సాక్షి కర్నూలు
మంగళవారం : 1 : ఏప్రిల్ : 2025



ఆరోగ్యానికి పొగ

ధూమపాన వ్యసనం శరీర ఆరోగ్యాన్ని గుల్ల చేస్తుంది. అయినా బీడీ, సిగరెట్ విక్రయాలు తగ్గడం లేదు. బహిరంగ ధూమపాన నిషేధ చట్టం అమలు కావడం లేదు. 8లో▸



నిఘాకు 'డ్రోనుడు'

డ్రోన్ కెమెరా ఇక నాటుసారా తయారీ కేంద్రాలను, పేకాట స్థావరాలను గుర్తిస్తుంది. అనుమానితులనూ బహిర్గతం చేస్తుంది. వీటి పనితీరును పోలీసులు పరిశీలించారు. 8లో▸



రూ.3 కోట్లు స్వాహా

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకును మోసం చేశారు. రూ.3.24 కోట్లు రుణం తీసుకున్న నలుగురిపై ఆదోని పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

15 మండలాల్లో కరువు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి 15 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రబీలో వర్షాభావ ప్రభావం దాదాపు అన్ని మండలాలపై తీవ్రంగా ఉంది. సాగు విస్తీర్ణం తగ్గిపోగా దిగుబడులు కూడా పడిపోయాయి. అయితే కర్నూలు జిల్లాలో పది మండలాలు, నంద్యాల జిల్లాలో ఐదు మండలాల్లోనే కరువు ప్రభావం ఉందని ఆయా జిల్లా అధికారులు ఇటీవల ప్రభుత్వానికి నివేదిక పంపారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆయా మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తూ విపత్తుల నిర్వహణ శాఖ జీవో ఎంఎస్ 3 జారీ చేసింది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాలు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ మండలాలు కరువు ప్రాంతాల జాబితాలో చేర్చకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

కర్నూలు జిల్లాలో కరువు మండలాలు: ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి, పత్తికొండ.

నంద్యాల జిల్లాలో కరువు మండలాలు: కొలిమిగుండ్ల, సంజామల, బనగానపల్లి, ఉయ్యాలవాడ, బేతంచెర్ల.

పండుగ రోజూ రిజిస్ట్రేషన్లు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రంజాన్ పండుగ ఉన్నా ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. మొత్తం 100 వరకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. కాగా.. కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో టైం స్లాట్ బుకింగ్‌ను పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. గతం నుంచే ఈ విధానం అమల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మొట్ట మొదటిసారి ప్రవేశపెట్టారని ప్రచారం చేసుకోవడం గమనార్హం.

10 నుంచి ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్



తుంగభద్ర దిగువ కాలువ

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు ఈ నెల 10వ తేదీన నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఆలస్యంగా సాగు చేసిన పైర్లు దెబ్బ తింటాయని, మరి కొద్ది రోజులు నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం(టీబీ డ్యాం)లో 11 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో డ్యాంలో నీరు ఆవిరవుతోంది. పంటలు ఎండుతున్న నేపథ్యంలో ఎల్లెల్సీకి నీటి విడుదలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.



కర్నూలు కొత్తబస్టాండ్ వద్దనున్న పాత ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అల్లాహు అక్బర్

జిల్లాలో సోమవారం రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, సోదరభావం వెల్లి విరియాలని ముస్లిం మత గురువులు అన్నారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ పలుచోట్ల ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.



వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న ముస్లింలు



గార్దభాల బండ్లతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

శ్రమయేవ జయతే

వారు కష్టాన్ని నమ్ముకుని జీవించే వారు. తమ శ్రమను కాస్త పంచుకునే గార్దభాలను గౌరవించారు. ఉగాది వేడుకల్లో భాగంగా సోమవారం కల్లూరులోని శ్రీ చౌడేశ్వరి మాత గుడి చుట్టూ బురదలో ప్రదర్శన నిర్వహించారు. శ్రమయేవ జయతే అని చాటుతూ.. గార్దభాలను బండ్లకు కట్టుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





నమ్మించి మోసగించారు

చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు అవుతోంది. ఇంతవరకు కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. నాకు 57 ఏళ్లు పూర్తయ్యాయి. టీడీపీ ప్రకటించిన ప్రకారం నాకు పింఛనుకు అర్హత ఉంది. సచివాలయానికి వెళితే దరఖాస్తు కూడా తీసుకోవడం లేదు. ఆకు వక్క, బీడీ కోసం ఇతరులపై ఆధారపడాల్సి ఉంది. నమ్మించి మోసం చేయడం తగదు.

– యు.సురేష్, అర్లబండ, కోసిగి మండలం



ఆకొక్కలు తినలేం.. మందులు కొనలేం!

పది నెలల్లో 14,497 పింఛన్ల తొలగింపు

- వెరిఫికేషన్ ముసుగులో కోతలు
- ఎన్నికలకు ముందు 50 ఏళ్లకే పింఛను ప్రచారం
- ఇప్పటి వరకు కొత్త పింఛన్ల ఊసే కరువు
- 3.50లక్షల మంది ఎదురుచూపులు
- గ్రీవెన్స్‌ల్లోనే 1.56 లక్షల దరఖాస్తులు

పింఛన్ల కోత ఇలా..

జిల్లా	గత ఏడాది జూన్‌లో పింఛన్లు	ఈ ఏడాది ఏప్రిల్‌లో పింఛన్లు
కర్నూలు	2,45,687	2,38,302
నంద్యాల	2,21,702	2,14,590

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా కొత్త పింఛన్ల ఊసే కరువైంది. ఇదే సమయంలో ప్రతినెలా ఉన్న పింఛన్లనే తొలగిస్తున్న పరిస్థితి. తాజాగా పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టడంతో వస్తున్న పింఛను ఉంటుందో, ఊడుతుందోననే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది. ఆకు, వక్కలు కొనాలన్నా దిక్కులు చూడాల్సి వస్తోందని.. ఇక ఆరోగ్యం బాగోలేక మందులు కొనాలంటే ఎవరిని అడిగేదని అవ్వాతాతలు కన్నీరు పెడుతున్నారు. సూపర్–6 మాయలో పడి మోసపోయామని ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు లబోదిబోమంటున్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఆశలు రేకెత్తించారు. ఇప్పుడు కొత్త పింఛనల మాట దేవుడెరుగు, ఉన్న పింఛన్లనే తొలగిస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతినెలా పింఛన్లలో కోత పడుతోంది. 10 నెలల కాలంలో గుట్టు చప్పుడు కాకుండా 14,497 పింఛన్లు తొలగింపులకు గురయ్యాయి. గత ఏడాది జూన్ నెలలో 4,67,389 పింఛన్లు ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్ నెల నాటికి పింఛన్ల సంఖ్య 4,52,892కు పడిపోయింది. తొలగించిన వారి స్థానంలో కొత్త పింఛన్‌లు ఇచ్చినా కొంతమందికైనా న్యాయం జరుగుతుంది. అలాకాకుండా పింఛన్లలో కోత విధిస్తూ, కొత్త పింఛన్ల ఊసెత్తకపోవడం గమనార్హం.

కొనసా..గుతున్న వెరిఫికేషన్ ప్రక్రియ

దివ్యాంగులు, హెల్త్ పింఛను లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారనే నిర్ధారణకు వచ్చిన కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతోంది. వారంలో మంగళ, బుధ, గురువారాల్లో పింఛన్లను మెడికల్ బోర్డుకు పిలిపించి రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 6వేలు, నంద్యాల జిల్లాలో 5వేల పింఛన్లను మాత్రమే వెరిఫై చేశారు. ఇంకా దాదాపు 48వేల పింఛన్లను పరిశీలించాల్సి ఉంది. ఆ తర్వాత వితంతు పింఛన్లను కూడా పరిశీలించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు ఇవ్వడం విశేషం. ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లను అర్హులకు అందించారు. రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లకు ఎంపిక చేశారు. గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు వలంటీర్లు ఇంటి వద్దకే మంజూరు పత్రం అందించిన రోజులను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ నామమాత్రమే!

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ క్రమంగా కొండెక్కుతోంది. పింఛను పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లను జియో ట్యాగింగ్ చేశారు. ఆ ప్రాంతం నుంచి 300 మీటర్ల(మూడు ఫర్లాంగులు) పరిధిలో పింఛను పంపిణీ చేసే వీలుకల్పించారు. అయినప్పటికీ ఆ దిశగా కూడా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. 80 శాతం పింఛన్ల పంపిణీ గ్రామ, వార్డు సచివాలయాలు.. రచ్చబండల వద్దే జరుగుతోంది. ఈ విషయమై అధికారులు ప్రశ్నిస్తే.. సచివాలయ ఉద్యోగులు నెట్‌వర్క్ సమస్య, ఇతరత్రా ఇబ్బందులను చెబుతున్నట్లు తెలుస్తోంది.

పింఛన్ల కోసం వినతుల వెల్లువ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు అవ్వాతాతలు దాదాపు 3.50 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో 60 శాతం మందికి పింఛన్లకు అర్హులే. అయితే వీరిని పట్టించుకున్న దాఖలాలులేవు. ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌కు పింఛను వినతులు వెల్లువెత్తుతున్నాయి. గత జూన్ నెల 12 నుంచి ఇప్పటి వరకు కొత్త పింఛన్ల కోసం దాదాపు 1.56 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

పప్పు.. తప్పు ప్రకటన

- మూడు నెలల నుంచి బ్యాళ్ల సరఫరా నిలుపుదల
- నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ



ఎండీయూ వాహనం ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఒక్కో కార్డుకు కేజీ కంది పప్పు ఇస్తామని పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అధికారులు సైతం ఆదేశించారు. అయితే మంత్రి చెప్పిన మాటలు తప్పు అని తేలుతోంది. మూడు నెలల నుంచి జిల్లాకు బ్యాళ్ల కేటాయింపులే జరగడం లేదు. పేదలకు ఇచ్చే బియ్యం, చక్కెరలోనూ భారీ కోతలు విధించారు. గతంలో బియ్యానికి బదులుగా కార్డుకు రెండు, మూడు కేజీల చొప్పున జొన్నలు, రాగులు ఇచ్చేవారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేశారు. జిల్లాలో 6,34,631 మంది రేషన్ కార్డుదారులు ఉండగా.. ఒక్కో కార్డుకు కేజీ కంది పప్పు రూ.67 చొప్పున ఇవ్వాల్సి ఉంది. జిల్లాకు 600 టన్నుల బ్యాళ్లను ఇవ్వకపోవడంతో పంపిణీ చేయడం లేదు. బయటి మార్కెట్‌లో కిలో రూ.135పైగా ధరతో కొనుగోలు చేయలేక పేదలు పప్పన్నానికి దూరమవుతున్నారు.

➤ జిల్లాకు ఏప్రిల్ కోటాకు సంబంధించి బియ్యం కేటాయింపుల్లో 2,900 టన్నుల కోత పడింది. మార్చిలో 11,746 టన్నులు బియ్యం ఇవ్వగా ఏప్రిల్‌కు సంబంధించి 8,747 టన్నులు కేటాయించారు. ఫలితంగా ఏప్రిల్‌లో పేదలకు బియ్యం లేదనే చెప్పే అవకాశం ఉంది.

➤ ప్రతి కార్డుదారుడికి అర్ధకేజీ చక్కెర రూ.17.50 చొప్పున ఇవ్వాల్సి ఉంది. జిల్లాకు 350 టన్నుల అవసరం ఉండగా 200 టన్నులు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది.

బ్యాళ్ల సరఫరా ఉండదు



ఏప్రిల్ నెలలో రేషన్ కార్డుదారులకు బ్యాళ్లసరఫరా ఉండదు. బియ్యంలో సరఫరాలో ఇబ్బందులు ఉండవు. చక్కెర అందుబాటులో ఉంటుంది. జొన్నలు, రాగులు అస్సలు లేవు.

– ఎం.రాజారఘువీర్, డీఎస్ఓ, కర్నూలు

పిడకల సమరం.. ప్రేమదే విజయం





శ్రీ వీరభద్ర స్వామి, కాళికాదేవి



గుర్రంపై వస్తున్న నందకిషోర్‌రెడ్డి



కైరుప్పలలో పిడకల సమరాన్ని తిలకిస్తున్న ప్రజలు

ఆస్పరి: ప్రేమికులను విడదీసే పెద్దలు చూసుంటాం.. విషాదాంతం అయిన ప్రేమ కథలను వింటూ ఉంటాం. ప్రేమను గెలిపించే పోరాటం అరుదుగా కనిపిస్తుంది. అలాంటి పోరాటమే ఒకటి ఆచారంగా ప్రతి ఏటా ఆస్పరి మండలంలోని కైరుప్పల గ్రామంలో కొనసాగుతోంది. వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం రెండు వర్గాల భక్తుల మధ్య ఉత్కంఠ భరితంగా పిడకల సమరం సాగింది. ఆచారం ప్రకారం కారుమంచి నుంచి పెద్దరెడ్డి వంశస్తుడైన నరసింహారెడ్డి గుర్రంపై మందీ మార్బలంతో ఊరేగింపుగా కైరుప్పల గ్రామానికి వచ్చారు. వీరభద్రస్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి వెనుతిరిగారు. ఆతరువాత పిడకల సమరం మొదలైంది. రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులు పరస్పరం ఒకరిపై ఒకరు పిడకలతో దాడి చేసుకున్నారు. వందల సంఖ్యలో గాల్లోకి పిడకలు లేచి ప్రత్యర్థి వర్గంపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపు అయ్యింది. పిడకల దుమ్ము ఆకాశాన్నంటింది. తమను తాము రక్షించుకుంటూ ఎదుటి వారిపై పిడకలు విసురుకుంటూ గుంపులు, గుంపులుగా కదిలారు. ఒక సారి ఒక వర్గం వారిది పైచేయి అయితే, మరో సారి మరో వర్గం వారిది పైచేయిగా నిలిచింది. దెబ్బలు తగిలిన వారు స్వామి వారి బండారు పూసుకున్నారు. ఈ సమరాన్ని జనం ఆసక్తిగా చూశారు. కేకలు, ఈలలతో హోరెత్తించారు. పిడకల సమరంలో రెండు వర్గాలకు చెందిన 30 మంది స్వల్పంగా గాయపడ్డారు. జనంతో కైరుప్పల కిట కిటలాడింది. సమరంలో గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆలయ కార్యనిర్వహణాధికారి రాంప్రసాద్, సర్పంచ్ తిమ్మక్క గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఆస్పరి సీఐ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పోరు ముగిసిన తర్వాత గ్రామ పెద్దలు.. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిలకు వివాహం చేసేందుకు నిశ్చయించారు.

ఉపాధ్యాయ సమస్యలపై రేపు నిరసన



ఫ్యాప్టో నాయకులు

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్నట్లు ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె. ప్రకాష్ రావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు జి.హృదయ రాజు తెలిపారు. ఎస్టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కరోనా కాలం నుంచి కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగులు మృతిచెందారని, కారుణ్య నియామకాల్లో భాగంగా వారికి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సరెండర్ లీవ్ బకాయిలు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లించాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సేవలాల్ నాయక్, ఆర్థిక కార్యదర్శి రంగన్న, నాయకులు రవికుమార్, నవీన్‌పాటిల్, గోకారి, జనార్దన్, శ్రీనివాసరెడ్డి, వెంకటరాముడు, నందీశ్వరుడు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో మార్పు మంచిదేనా?

- నేటి నుంచి సెకండ్ ఇయర్ ఇంటర్ తరగతులు
- 7 నుంచి ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: ఇంటర్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. అయితే ఇవి విద్యార్థులకు మంచి చేస్తాయా అనే ప్రశ్నలు వస్తున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు 161 ఉన్నాయి. ఇంటర్మీడియట్ విద్యలో కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలలో భాగంగా రేపటి(మంగళవారం)నుంచి 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించి 24నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. తిరిగి జూన్ 2వ తేదీన కాలేజీలు తెరుచుకోనున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ నాటికే విద్యార్థుల చేతికి నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇంత వరకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఒక్క నోటు బుక్కు కానీ, పాఠ్యపుస్తకం కానీ రాకపోవడం గమనార్హం. కర్నూలు జిల్లాకు 1,73,532 నోటు బుక్స్, 85 వేల పాఠ్యపుస్తకాలు, నంద్యాల జిల్లాకు 1,21,884 నోటు బుక్స్, 60 వేల పాఠ్యపుస్తకాలు అవసరం ఉందని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఇండెంట్ పెట్టారు.

7 నుంచి ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు

ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి 23వ తేది వరకు అడ్మిషన్లు చేసుకునేందుకు షెడ్యూల్ జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. మూల్యాంకనం 3 నుంచి 9వ తేదీ వరకు జరగనుంది. ఆ తరువాత 20 రోజులకు ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఫలితాలు రాకముందే ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వడం బట్టి చూస్తే కార్పొరేట్, సెమీ కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలకు పరోక్షంగా సహాయం చేసేందుకే అని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

కసరత్తు లేకుండానే..

ముందస్తు కసరత్తు లేకుండానే అకడమిక్ ఇయర్‌ను ప్రారంభించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. అధ్యాపకులు లేకుండానే అకడమిక్ ఇయర్‌ను ఎలా ప్రారంభిస్తున్నారనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఆదేశాలు ఇచ్చాం

ఇంటర్మీడియట్ బోర్డు తీసుకొచ్చిన నూతన సంస్కరణల ప్రకారం 2025–26 విద్యా సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే మొదలు కానుంది. 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించి 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు సెలవులు ఉంటాయి. ఏప్రిల్ 1 నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చాం.

– జీవీఎస్ గురవయ్య శెట్టి, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

APRJC/పాలిటెక్నిక్
ఎంట్రన్స్ కోచింగ్ ఏప్రిల్ 02న ప్రారంభం
శ్రీ ఈశ్వరాస్
కర్నూలు. Cell: 94402 31403

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛపై దాడి అనైతికం

- గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్



గడివేముల: పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ వ్యవహరించడం అనైతికమని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ విమర్శించారు. సోమవారం గడివేముల మూల పెద్దమ్మ దర్శనానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల సాక్షి కార్యాలయంపై ఆమె దాడికి యత్నించడం సబబుకాదన్నారు. పత్రికలు, టీవీల్లో వ్యతిరేక కథనాలు రాస్తే దాడులు చేస్తామనే భయాన్ని జర్నలిస్టుల్లో కలిగించేందుకు ఆమె యత్నిస్తున్నారన్నారు. వాస్తవాలు రాసే మీడియాపై దాడులు ఎంతవరకు సమంజసమన్నారు. మీడియాలో వ్యతిరేక వార్తలు వస్తే దానికి ఖండన కోరడం, లీగల్ నోటీసులు ఇవ్వాలనే కానీ.. గూండాగిరికి యత్నించడం సరికాదన్నారు. అఖిలప్రియ సాక్షి కార్యాలయంపై దాడిచేసేందుకు వస్తుంటే పోలీసులు ఆమెను గృహ నిర్బంధం చేయకుండా ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. ఇది పరోక్షంగా దాడికి సహకరించడమేనన్నారు.

కోలుకోలేక రిటైర్డ్ ఏఎస్ఐ మృతి



మృతి చెందిన నారాయణమూర్తి

ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిటైర్డ్ ఏఎస్ఐ నారాయణమూర్తి(77) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. శనివారం ఆయన మాతా శిశు ఆసుపత్రి వద్ద వస్తుండగా బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులోని దొంగలు పరార్?

- ఆలస్యంగా వెలుగులోకి..

పాణ్యం: విద్యుత్ తీగల దొంగలు పోలీసుల కళ్లు గప్పి పరారయ్యారు. పట్టుబడిన దొంగలను వాహనంలో స్టేషన్‌కు తరలిస్తుండగా అదును చూసి తప్పించుకున్నారు. పాణ్యం పోలీసు స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిన్నాపురం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు విద్యుత్ తీగలు చోరీ చేసి విక్రయించినట్లు పోలీసులకు సమాచారం అందింది. వారిపై నిఘా పెట్టిన పోలీసులు ఆదివారం గ్రామానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిని జీపులో స్టేషన్‌కు తరలిస్తుండగా పాణ్యం సర్వీస్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండటంతో వాహన వేగం తగ్గింది. ఆ క్రమంలో జీపులో ఉన్న దొంగలు వెంటనే దిగి పరుగులు తీశారు. అయితే ప్రధాన నిందితుడు పోలీసులు ఆదుపులో ఉన్నట్లు సమాచారం.

ఆరోగ్యానికి పొగ

- ధూమపానంతో పలు వ్యాధులు
- మానితే ఆరోగ్య ప్రయోజనాలు
- పెద్దాసుపత్రిలో టొబాకో నజెషన్ సెంటర్
- ఏటా 2,500 మందికి చికిత్స
- ఉచితంగా నికోటిన్ ప్యాచెస్, గమ్స్
- పొగాకు అలవాటు మాన్పించేందుకు చికిత్స



కర్నూలు(హాస్పిటల్): మిత్రుల సహవాసంతోనో.. ఒత్తిడి తగ్గించుకోవాలనో ఉద్దేశంతో ప్రారంభమయ్యే ధూమపాన అలవాటు ఒక పట్టాన వదిలిపెట్టదు. పలుమార్లు వదిలిపెట్టాలనుకుని బాసలు చేసినా 'నినువీడని నీడను నేను'.. అన్నట్లు వెంటాడుతూనే ఉంటుంది. ఇలా వెంటపడిన ఆ వ్యసనం క్రమంగా శరీర ఆరోగ్యాన్ని గుల్ల చేస్తోంది. ఈ అలవాటును మాన్పించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డీ అడిక్షన్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ధూమపానం క్యాన్సర్‌కు కారకం. అని బీడీ, సిగరెట్ పెట్టెలపై ముద్రించి ఉన్నా ధూమపాన ప్రియులు వాటిని మాత్రం వీడటం లేదు. ఈ మేరకు జిల్లాలో బీడీ, సిగరెట్, చుట్ట, గుట్కా విక్రయాలు తగ్గడం లేదు. ధర ఎంత పెరిగినా వాటిని కొనుగోలు చేసి వాడుతున్నారు. వాటి డిమాండ్ దృష్ట్యా కర్నూలు నగరంలోనే టోకు వర్తక వ్యాపారులు అధికంగా ఉన్నారు. ఇక్కడి నుంచే నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లి, ఆళ్లగడ్డ, శ్రీశైలం వంటి ప్రాంతాలకు చిన్న తరహా డీలర్లు తీసుకెళ్లి అక్కడి రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

ధూమపాన నిషేధ చట్టం ఉన్నా...

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2008 అక్టోబర్ 2న బహిరంగ ధూమపాన నిషేధ చట్టం (సీవోటీపీ-2008)ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారం బస్టాండ్, రైల్వేస్టేషన్లు, సినిమాహాళ్లు, మార్కెట్, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచారం ఉండే ప్రదేశాల్లో ధూమపాన నిషేదం అమలులో ఉంది. దీనిని అతిక్రమిస్తే రూ.200ల జరిమానాతో పాటు జైలుశిక్ష విధించాలని చట్టం చెబుతోంది. పొగాకు ఉత్పత్తులను 18 ఏళ్లలోపు ఉన్న వారికి అమ్మినా జరిమానా విధించాలి. పొగాకు నియంత్రణ, బహిరంగ ధూమపానాన్ని అరికట్టే బాధ్యతను పోలీసులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జాతీయ హెల్త్ మిషన్ ఫైనాన్స్ మేనేజర్, ప్రభుత్వ వైద్యులు అప్పగించారు. కానీ ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదన్నది బహిరంగ రహస్యం. ఈ కారణంగా బహిరంగ ప్రదేశాలైన బస్టాండ్, టీ కొట్లు, రైల్వేస్టేషన్‌లు, రైళ్లు, బస్సులలోనూ యథేచ్ఛగా ధూమపానం చేస్తున్నా అడిగివారు కరువయ్యారు.



ధూమపానం చేసే వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్యసిబ్బంది

పెద్దాసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2021లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రిక్ విభాగంలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు ఉన్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సెలింగ్, బిహేవియర్ థెరపి చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్, నికోటిన్ గమ్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. దీనివల్ల పొగ తాగాలి, పొగాకు నమలాలి అనే ఆలోచనను తగ్గిస్తుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడతాయి. 2019లో 202 మంది, 2020లో 1334 మంది, 2021లో 2,254 మంది, 2022లో 2,234 మంది, 2023లో 2405 మందికి, 2024లో 2,418 మందికి చికిత్స అందించారు. ఇందులో అధికంగా 11 ఏళ్ల పిల్లల నుంచి యువకులు, పెద్దల వరకు ఉంటున్నారు. ఇక్కడ చికిత్స తీసుకున్న వారిలో 25 శాతానికి పైగా బాధితులు తమ అలవాట్లు మానుకుంటున్నారు.

ధూమపానం వల్ల క్యాన్సర్



బీడీ, సిగరెట్ తాగే వారిలో క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్‌లు వస్తాయి. బీడీ, సిగరెట్ అధికంగా తాగే వారిలో చేతులు, కాళ్లలోని నరాలు మూసుకుపోతాయి. ఫలితంగా కాళ్లు, చేతుల్లో రక్తప్రసారం తగ్గిపోతుంది. దీనివల్ల కాళ్లు, చేతులు నల్లగా మారిపోయి తీవ్ర నొప్పిని కలుగజేస్తున్నాయి. గ్యాంగ్రిన్‌గా మారిన కాలు, చేతిని తీసేయాల్సిన పరిస్థితి వస్తుంది.

– డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

గుండె సమస్యలకు దారి తీస్తుంది



రోజూ ధూమపానం చేసే వారిలో, చేయని వారితో పోలిస్తే గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ. సిగరెట్ తాగడం వల్ల గుండెపోటుతో పాటు బ్రెయిన్‌స్ట్రోక్, రక్త నాళాల్లో రక్తం గడ్డకట్టడం, కాళ్లలో ధమనులు గట్టిగా మారడం సంభవిస్తాయి. ధూమపానం గుండె కండరాలకు ఆక్సిజన్ తీసుకెళ్లే రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడటానికి కారణం అవుతుంది. ఈ కారణంగానే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలి. ఒకవేళ అలవాటుంటే నెమ్మదిగా దానికి దూరం కావాలి.

– డాక్టర్ లక్ష్మణస్వామి, కార్డియోవాస్కులర్ సర్జన్, కర్నూలు

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.3 కోట్లు స్వాహా

- ప్రభుత్వ భూమిని సొంత భూమిగా మార్చిన వైనం
- ఆ పత్రాలతో అవ్వా బ్యాంకులో రూ.3.24 కోట్ల రుణం
- బ్యాంకు సీఈఓతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: ప్రభుత్వ భూమిని సొంత భూమి అంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, వాటితో బ్యాంక్‌ను మోసం చేశారు. రూ.కోట్ల రుణం తీసుకుని చెల్లించకపోవడంతో అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో ఆపరేటివ్ బ్యాంకులో రూ.3.24 కోట్లు రుణం తీసుకున్న నలుగురిపై వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పట్టణానికి చెందిన యలే మల్లేశప్ప, యలే చెన్నబసప్ప, యలే చైత్ర ప్రభుత్వ స్థలాన్ని తమ సొంత స్థలమంటూ మూడు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. బ్యాంకు సీఈఓ గట్టు మురళి సహకారంతో రూ.3.24 కోట్లు రుణం తీసుకున్నారు. అయితే ఆ రుణాన్ని ఇంతవరకు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఆ స్థలాన్ని వేలం వేయడానికి సిద్ధమయ్యారు. అయితే ప్రభుత్వ స్థలాన్ని వేలం ఎలా వేస్తారని ప్రభుత్వ ఉద్యోగులు అడ్డుకున్నారు. ల్యాండ్ డాక్యుమెంట్ డేటా తీయగా, ఆ మూడు డాక్యుమెంట్లు నకిలీవిగా తేలింది. బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా.. బ్యాంకు సీఈఓ గట్టు మురళి పాత్ర వెలుగులోకి వచ్చింది. అతని సహకారంతో నకిలీ డాక్యుమెంట్లతో రూ.3.24 కోట్ల రుణాన్ని నిందితులు తీసుకున్నారు. తీసుకున్న రుణం చెల్లించగకుండా, బ్యాంక్‌ను మోసం చేసిన యలే మల్లేశప్ప, యలే చెన్నబసప్ప, యలే చైత్ర, వారికి సహకరించి రుణం ఇప్పించిన బ్యాంకు సీఈఓ గట్టు మురళిపై చీటింగ్, ఫోర్జరీ, తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భర్త మద్యం మానడం లేదని..

మహానంది: భర్త మద్యానికి బానిసయ్యాడని మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన బి.వెంకటలక్ష్మమ్మ(48) భర్త చిన్న వెంకటేశ్వర్లు మద్యానికి బానిస కావడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఆదివారం ఇంట్లో ఉన్న రసాయన పొడిని నీళ్లలో కలిపి తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- ఎంగేజ్‌మెంట్‌కు ఒక రోజు ముందు ఘటన



కురవ వీరనాగన్న (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్/పెద్దకడుబూరు: పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామ పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన కె. రంగన్న, కె.జయమ్మకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు కె. వీరనాగన్న (26) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఎటువంటి ఉపాధి లేకపోవటంతో పట్టణంలో హమాలీ పనికి వెళ్లేవాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసి ఇంటి మిద్దెపై పడుకోవటానికి వెళ్లాడు. సోమవారం ఉదయం కనిపించకపోవటంతో బయటకు వెళ్లాడేమో అని కుటుంబ సభ్యులు భావించారు. అయితే వెంకటాపురం సమీపంలోని హెచ్.మురవణి పరిధిలోని తమ పొలంలో ఓ చెట్టు కింద వీరనాగన్న విగత జీవిగా పడి ఉన్నాడు. సమీపంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శ్రీనివాసులు వెంకటాపురానికి పోలీసులను పంపి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మృతి చెందిన సంఘటన స్థలం పెద్దకడుబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో కోసిగి సీఐ మంజునాథ్, పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా ఉందని, శరీరంపై గాయాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరనాగన్నకు కోసిగి మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి కుదిరింది. మంగళవారం ఎంగేజ్‌మెంట్ జరగాల్సి ఉంది. ఇంతలోనే యువకుడు మృతి చెందటంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రామ ఫలం ఎంతో రుచి..





రామఫలవృక్షం (ఇన్‌సెట్లో) వృక్షానికి కాయలు కనిపిస్తున్న దృశ్యం

సీతా ఫలం తిన్నాము కానీ... రామ ఫలం ఎప్పుడూ చూడలేదు.. తినలేదు అనుకుంటున్నారా.. అవును ఇది మన ప్రాంతంలో పండదు. ఉత్తరాంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లో లభిస్తాయి. అయితే తినాలనుకంటే సూపర్ మార్కెట్లలో, ఆన్‌లైన్‌లో లభిస్తాయి. పేరుకు తగ్గట్టే ఈ పండులో ఎన్నో పోషకాలు ఉండి ఆరోగ్యాన్ని సంరక్షిస్తోంది. ముఖ్యంగా క్యాన్సర్‌ను నివారించే గుణాలు ఈ పండులో ఉన్నాయి. ఇప్పుడు ఈ పండు గురించి ప్రస్తావన ఎందుకంటే.. మండల కేంద్రమైన జూపాడుబంగ్లా శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నివాసముంటున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తి పన్నెండేళ్ల క్రితం రామఫలం మొక్కను నాటగా ఇది ఇప్పుడు పెరిగి కాయలు కాస్తోంది. వీటి తొడిమె గుండ్రంగా ఉండి పండు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఎన్నో ఔషధగుణాలు ఉన్న రామఫలం వృక్షాన్ని ప్రతి ఇంటి పెరటిలో పెంచుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

– జూపాడుబంగ్లా



ఉత్సవానికి దొర వెడలె!

రాజరిక సంప్రదాయానికి ప్రతీకగా మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో సోమవారం పార్వేట కార్యక్రమం వేడుకగా సాగింది. దూదేకొండ దొరల సంస్థానం పాలేగార్ చిన్న వెంకటప్పనాయుడుని గ్రామస్తులు గుర్రంపై ఊరేగిస్తూ గ్రామంలో ఉత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యువత కేరింతలు కొడుతూ పార్వేట ఉత్సవాన్ని కొనసాగించారు. ఏటా ఉగాది పండుగ అనంతరం దొరల వంశీకులను ఇలా గుర్రంపై ఊరేగించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. ఉత్సవంలో గ్రామ రైతులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పత్తికొండ రూరల్

వైభవంగా శ్రీరంగనాథ పార్వేట





పల్లకీలో ఊరేగుతున్న శ్రీరంగనాథుడు, పార్వేట కుందేళ్లను పట్టుకున్న గ్రామస్తులు

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడు ఉగాది సంబరాల్లో భాగంగా సోమవారం స్వామి వారు పార్వేటను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందెసేవతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని పల్లకీలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులోని గోదా చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చెరువులో కుందేళ్లను వదిలి పట్టుకునే పార్వేట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వీరయ్యతోపాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిఘాకు 'డ్రోనుడు'

- జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్
- నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరా వినియోగం



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్

కర్నూలు: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తు నిర్వహణ, బందోబస్తులు, బహిరంగ సభలు, జాతరలు, ఊరేగింపు సమయంలో జన సమూహాన్ని పర్యవేక్షించడం కోసం ఇకపై జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్ అమలు చేయనున్నారు. ఇందుకోసం ఏపీ డీజీపీ కార్యాలయం నుంచి జిల్లా పోలీసు శాఖకు కేటాయించనున్న డ్రోన్ కెమెరా పనితీరును కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని స్మార్ట్ పోలీసింగ్‌తో నేరాలను నియంత్రించడానికి, డ్రోన్ సాంకేతికతను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. డ్రోన్ కెమెరా చెన్నై మార్స్ ఏరో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. దీని ద్వారా క్రౌడ్ మేనేజ్‌మెంట్ ద్వారా అవాంఛనీయ సంఘటనలు నిలువరించవచ్చు. సెన్సిటివ్-హాట్‌స్పాట్ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించుటకు, వరదలు, భూకంపాల వంటి విపత్తు సమయాల్లో రెస్క్యూ, సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపయోగపడుతుంది. అలాగే అనుమానితులను గుర్తించడం, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, పండుగలు, ఉత్సవాలు, కర్ఫ్యూలు, అత్యవసర సమయాల్లో 5 కిలోమీటర్ల వరకు ఈ డ్రోన్ ప్రయాణించగలదు.

నైట్ విజన్ కెమెరాతో పర్యవేక్షణ...

ఈ పరికరం నైట్ విజన్ కెమెరాతో పర్యవేక్షిస్తుంది. నాటుసారా తయారీ, పేకాట స్థావరాలు, బహిరంగ/పబ్లిక్ ప్రదేశాల్లో అనుమానితులను, నగర శివార్లలో చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలపై రాత్రి సమయాల్లో వాహనాల నెంబర్లను కూడా నైట్ విజన్ కెమెరాతో పర్యవేక్షిస్తుంది. వరదలు, రెస్క్యూ సమయాల్లో పేలోడ్ టెక్నాలజీతో బాధితులకు సహాయం అందించడానికి 5 కేజీల ఆహార పదార్థాలు (ఫుడ్) కాని లేదా మెడికల్ వస్తువులు కానీ తీసుకెళ్లగలదు. డ్రోన్ కెమెరా పరిశీలన కార్యక్రమంలో బెటాలియన్ డీఎస్పీ రమణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి, నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళ డ్రోన్లతో పర్యవేక్షణ

రంజాన్ పురస్కరించుకుని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నగర పోలీసులు డ్రోన్ల ద్వారా నిఘా పెంచారు. కర్నూలు నగరంలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉండటం వల్ల ఒకవైపు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తూనే మరోవైపు ప్రార్థన ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘాను పర్యవేక్షించారు. ప్రార్థనలకు ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఏర్పడలేదు. రంజాన్ పర్వదినం ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం పట్ల పోలీసులు సంతృప్తి వ్యక్తం చేశారు.

'స్పాట్'కు స్కూల్ అసిస్టెంట్లు కావలెను


- ఏప్రిల్ 3 నుంచి పది మూల్యాంకనం ప్రారంభం
- స్కూల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- ఏటా ఇదే తంతు... గత అనుభవాలతో గుణపాఠం నేర్వని విద్యాశాఖ

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి జవాబు పత్రాలు మూల్యాంకన ప్రక్రియలో స్కూల్ అసిస్టెంట్ల (ఎస్ఏ) పాత్ర చాలా కీలకం. మూల్యాంకనంలో ప్రతి ముగ్గురు ఏఈ (అసిస్టెంట్ ఎగ్జామినర్లు)లకు ఒక స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) నియమించాల్సి ఉంది. ఏప్రిల్ 3 నుంచి జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జిల్లాకు దాదాపు 2 లక్షలకు పైగా జవాబు పత్రాలు రానున్నాయి. ఇప్పటికే తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, గణితం, బాటనీ పరీక్షల జవాబు పత్రాలు చేరాయి. నంద్యాలలోని ఎస్‌డీఆర్ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపరిచారు. అయితే స్పాట్‌కు సుమారు 200 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు అవసరం కాగా, ఇప్పటి వరకూ ఆ విధులు నిర్వర్తించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఏటా ఇదే తంతు కొనసాగుతూ వస్తున్నా... గత అనుభవాలతో విద్యాశాఖ అధికారులు గుణపాఠం నేర్చు కోకపోవడం గమనార్హం. స్కూల్ అసిస్టెంట్ల విషయంలో ఈసారి కూడా గత ఏడాది పరిస్థితులే ఎదురయ్యాయి. ముందుగానే అప్రమత్తమవుతున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి మండలం నుంచి కనీసం 10 మంది టీచర్లను ఎంపిక చేసి స్కూల్ అసిస్టెంట్ల విధులకు పంపాలని డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మంత్రాంగం ఎంత మాత్రం పని చేస్తుందనేది మూల్యాంకనం ప్రారంభమైన తొలిరోజు తెలిసిపోతుంది.

స్కూల్ అసిస్టెంట్ల విధులు ఇలా..

మూల్యాంకనంలో చిన్నపాటి తప్పిదం జరిగినా నష్టపోయేది విద్యార్థులే. అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) పేపర్లు దిద్ది మార్కులు వేసిన తర్వాత ఆ జవాబు పత్రాన్ని స్కూల్ అసిస్టెంట్లు తీసుకుని మార్కుల పోస్టింగులు, టోటలింగ్ పరిశీలించాల్సి ఉంటుంది. చిన్నపాటి తప్పిదాలకు తావివ్వకుండా ఏఈలు దిద్దిన జవాబు పత్రాలను స్కూల్ అసిస్టెంట్లు మరోసారి పరిశీలించి మార్కుల వివరాలను ధ్రువీకరించాల్సి ఉంది. అయితే మూల్యాంకన ప్రక్రియలో పాల్గొంటున్న ఇతర అన్ని కేడర్ల కంటే స్కూల్ అసిస్టెంట్లకే రెమ్యూనరేషన్ తక్కువ. పైగా డీఏ వెసులుబాటు ఉండదు. మండుతున్న ఎండలకు తోడు ఆశించిన స్థాయిలో రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడంతో చాలా మంది టీచర్లు స్కూల్ అసిస్టెంట్లు ఆసక్తి చూపడం లేదు.

సమస్యను అధిగమిస్తాం



ఏప్రిల్ 3న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. స్పెషల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపక పోవడమనేది ప్రతి ఏటా ఎదురవుతున్న సమస్యనే. ఈసారి ఈ సమస్యను అధిగమిస్తాం. వీలైనంత మందిని నియమించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే డీవైఈఓలు, ఎంఈఓలకు లేఖలు రాశాం. ప్రతి మండలం నుంచి కనీసం పదిమంది టీచర్లను స్పెషల్ అసిస్టెంట్లుగా పంపాలని చెప్పాం.

– జనార్ధన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

We Are HIRING
మీ Qualification, Skills, Experience బట్టి Salaries ఇవ్వబడును.
Note: Attractive Salary for Deserving Candidates
Requirements :
- Principals (Male & Female)
- Faculties (Physics/Chemistry/Bio/Maths)
- PRO's (Mandal Wise)
- Lady Telecallers
- Hostel Wardens
- Attenders
- Office Boy
- Watchman
Call/WhatsUp/Your Resume : 9177177289
WISDOM ACADEMY NEET/IIT-JEE/EAPCET Opp: Kurnool Medical College.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE DEGREE & PG
Degree : B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLiSc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLiSc. Sri Vijayadurga Degree College, Kurnool: Contact: 90306 28410, 93937 28410. [L-779103]

PARAMEDICAL COORSES
పారా మెడికల్ డిప్లొమా కోర్సులైన DMLT, DMST, DANS, DMIT, DECG, DCARDIO, DOM, DCLT, DRTT, DIALYSIS, DPERFU లలో అడ్మిషన్లు జరుగుచున్నవి. సంప్ర: జయలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ సైన్సెస్, కర్నూలు. © 9347838576, 9440716644. [L-779105]

COACHING
BRIGHT BEE COCHING CENTRE KURNOOL. 10వ తరగతి విద్యార్థులకు APRJC మరియు POLYTECHNIC ప్రవేశ పరీక్షల కొరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడును. హాస్టల్ వసతి కలదు. తరగతులు ఏప్రిల్ 4వ తేది నుండి ప్రారంభమగును. వివరాలకు సంప్ర:7075476035, 9493902958. [L-779101]

REAL ESTATE

PLOT FOR SALE
RR రియల్ ఎస్టేట్. కర్నూలు To బెంగుళూరు రోడ్డు, దూపాడు రిడ్జ్ స్కూల్ దగ్గర 2BHK ఇండిపెండెంట్ హౌసెస్ & ఇన్వెస్ట్‌మెంట్ కొరకు అన్ని సౌకర్యాలతో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర: 9182821014. [L-779102]

SERVICES

BUSINESS OFFER
ఇంట్లో ఉంటూ తక్కువ పెట్టుబడితో స్త్రీ/పు।। 100 రకాల స్వయం ఉపాధి పరిశ్రమలతో రోజుకు 1000-2k ఆపైన సంపాదన. Since 10సం।।నుండి. ఫోన్: 7075563414 [HA-4038]

WANTED
పారా మెడికల్ కాలేజీలో బోధించుటకు MBBS & M.Sc టీచింగ్ ఫ్యాకల్టీ పార్ట్ టైం/ఫుల్ టైం కావలెను. సంప్ర: జయలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ సైన్సెస్, కర్నూలు. 9347838576, 9440716644. [L-779104]

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆఫీస్ అడ్రస్: ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ శివాలయం టెంపుల్ ప్రక్కన. అర్హత: 10th పాస్. జీతం:16,000, రూమ్ ఫ్రీ, భోజన వసతి కలదు. Age: 19 to 45. సంప్రదించండి: © 88974 44705. [SCA25002493]

Trained and Experienced Telugu, Hindi, English, Maths, Physics, Biology, Social Teachers to Teach 4th to 10th Classes. Cambridge School. 99491 51098 [L-783122]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k. ఫోన్: 9640400073, 9160900024 [SCA25002453]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 8317512135 [HA-245]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09185
70750 09165
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-